ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 43.0 కనిష్ఠం: 30.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిని దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఎస్ఐ కే.రవి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మండల కేంద్రానికి చెందిన వనపర్తి గోపాల్(65) ముఖ్య కూడలిలో రోడ్డు దాటుతుండగా జడ్చర్ల నుంచి హైదారాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దాంతో తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చనిపోయాడు. గోపాల్ కుమారుడు సురేందర్ కారు డ్రైవరుపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదిలోనూ.. బాలికలదే పైచేయి

- నారాయణపేటకు రాష్ట్రంలో 15వ స్థానం
- ఉమ్మడి జిల్లాలో నారాయణపేట ఫస్ట్.. గద్వాల లాస్ట్



10/10 జీపీఏ సాధించిన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నచేడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని పల్లవిని అభినందిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30: పదో తరతగతిలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఫలితాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఇంటర్‌తో పాటు ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయిగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల విద్యార్థులకు మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి 10/10 జీపీఏ సాధించారు. నారాయణపేట జిల్లా 93.13 శాతం ఉత్తీర్ణత సాధించి.. రాష్ట్రంలో 15వ స్థానంలో, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. జోగులాంబ గద్వాల 81.38 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 32, ఉమ్మడి జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని కేజీబీవీల్లో చదివిన విద్యార్థులు ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలోని 14 కేజీబీవీల నుంచి 581 విద్యార్థినులు పరీక్ష రాయగా.. 546 మంది ఉత్తీర్ణత సాధించారు.

17 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత

మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో ప్రభుత్వ వీహెచ్‌పీ పాఠశాల, కేజీబీవీలు ఐదు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి.

జిల్లాల వారీగా ఫలితాల వివరాలు ఇలా..

జిల్లా	ఉమ్మడి స్థానం	రాష్ట్రంలో స్థానం	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	శాతం
నారాయణపేట	1	15	7655	7129	93.13
నాగర్‌కర్నూల్	2	23	10,507	9621	91.57
మహబూబ్‌నగర్	3	28	12,673	11,338	89.47
వనపర్తి	4	29	6,888	5988	86.93
జోగుళాంబ గద్వాల	5	32	7,175	5839	81.38

పట్టు చీరలు ఎత్తుకెళ్తున్నారు

- కొనుగోలు పేరుతో దుకాణాల్లో చోరీలు
- ఇటీవల 10 చీరలను దుస్తుల్లో దాచుకొని వెళ్లిన మహిళ
- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆందోళన చెందుతున్న యజమానులు



దొంగలించిన పట్టుచీరలతో మహిళలు పారిపోతున్న కారు ఇదే..(ఫైల్)

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కిష్టారెడ్డి బంగ్లా కాలనీ పట్టు చీరల విక్రయాలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పట్టుచీరలు అమ్మే దుకాణాలు వందల్లో ఉంటాయి. రెండు వేల నుంచి లక్ష రూపాయల విలువైన చీరలు ఇక్కడ లభిస్తాయి. చీరల కొనుగోలు కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తూ ఉంటారు. ఇదే అదనుగా కొందరు కొనుగోలు నెపంతో దుకాణాలకు వస్తున్నారు. యజమానిని మాటల్లో పెట్టి చీరలను దుస్తుల్లో దాచుకొని ఉడాయిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ సంఘటన అందుకు నిదర్శనమని చెప్పొచ్చు. ఇక్కడి విఘ్నేశ్వర్ శారీహౌస్‌కు ఓ మహిళ ఇద్దరు పురుషులతో కలిసి వచ్చింది. ఆ సమయంలో దుకాణం యజమాని వినోద్ పనిమీద బయటకు వెళ్లాడు. ఆయన తాత లక్ష్మీనారాయణ దుకాణంలో కూర్చున్నారు. ఇద్దరు మగవారు అతడిని మాటల్లో పెట్టారు. ఆ మహిళ దుకాణం లోనికి వెళ్లింది. 10 పట్టు చీరలను తన దుస్తుల్లో దాచుకొని బయటకు వచ్చింది. తనకు చీరలు నచ్చలేదని, కొత్త స్టాక్ వచ్చాక వచ్చి కొనుగోలు చేస్తామని చెప్పి ముగ్గురూ కారెక్కి వెళ్లి పోయారు. అదే సమయంలో యజమాని వినోద్ వచ్చాడు. జరిగిన విషయాన్ని తాత అతడికి వివరించాడు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా మహిళ చీరలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే ద్విచక్ర వాహనంతో కారును వెంబడించాడు. గమనించిన కారులోని మహిళ అక్కడొకటి, ఇక్కడొకటి మూడు చీరల ను బయటకు విసిరేసింది. వినోద్ బైక్‌ను ఆపి చీరలను తీసుంటుండగా, కారు వేగంగా వెళ్లిపోయింది. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారులు స్పందించి నిఘా పెంచాలని, చీరల దొంగతనాలు అరికట్టేందుకు కృషి చేయాలని దుకాణాల యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలోనూ పలు సంఘటనలు

ఇలాంటి సంఘటనలు గతంలోనూ జరిగినట్లు దుకాణాల యజమానులు చెప్తున్నారు. శిరిడీసాయి శారీ హౌస్‌లో 10 పట్టు చీరలు, సంతోష్‌కుమార్ శారీ హౌస్‌లో ఆరు, శ్రీలత గద్వాల శారీహౌస్‌లో ఎనిమిది, సునిత గద్వాల సారీ హౌస్‌లో ఎనిమిది, రామ్‌ప్రసాద్ శారీ హౌస్‌లో 10 పట్టుచీరలు చోరీకి గురైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. రాయలసీమకు చెందిన వారే చోరీలకు పాల్పడు తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. వినోద్ వెంబడించిన కారు కూడా కర్నూల్ వైపే వెళ్లిందని వారు తెలిపారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



జిల్లా కేంద్రంలో చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవలే పలు దొంగతనాలను ఛేదించి నిందితులను రిమాండుకు తరలించాం. చీరల చోరీ కేసును కూడా త్వరలోనే ఛేదిస్తాం. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా చర్యలు తీసుకుంటాం. చోరీ అయిన చీరలు, సొత్తును రికవరీ చేసేందుకు కృషి చేస్తాం.

- రితి రాజ్, ఎస్పీ, గద్వాల

ఐదున రాహుల్ గాంధీ రాక



ఎర్రవెల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

ఎర్రవల్లి, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల ఐదో తేదీన ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లడారు. రాహుల్ సభను విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల నుంచి అధిక మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దురదృష్టవశాత్తు తాను ఓటమి పాలైనా.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు. అంతకు ముందు బహిరంగ సభా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి, మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు లక్ష్మీనారయణరెడ్డి, సోమనాద్రి, నీలి శ్రీను, మాణిక్యరెడ్డి, మెడికల్ మద్దిలేటి, నరసింహ, వెంకటేష్, బజారన్న, శ్యామ్ సుందర్, మధునాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం
- మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ఓటును అభ్యర్థిస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 30 : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట మండలంలోని ఊటకుంటతండా, బండగొండ, తిర్మలాపూర్, బొమ్మన్‌పాడ్, పేరపళ్ల, మీదితండా, కింది తండాలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ పాలనను వ్యతిరేఖిస్తూ ప్రజల్లో మార్పు మొదలైందన్నారు. దేవుడి పేరుతో ఓట్లడుగుడు తప్ప అభివృద్ధి చేశామని చెప్పే ధైర్యం నరేంద్ర మోదీకి లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధినే పేర్లు మార్చుకుని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాలం గడుపుతున్నాయన్నారు. కేసీఆర్‌కు పట్టిన గతే నరేంద్రమోదీకి పడుతుందని విమర్శించారు. ప్రతీ గ్రామంలో బడి, గుడి కట్టినా, పేదోడికి ఇందిరమ్మ ఇళ్లు కట్టినా అది కాంగ్రెస్ చేసిన ఘనతగానే మిగిలిపోయిందన్నారు. బీజేపీ అభివృద్ధి తెలియని పార్టీ అని, అది తెలిసి ఉంటే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇచ్చేవారన్నారు. పాలమూరు జిల్లా ఇలా ఎడారిగా మిగిలిపోయి ఉండేది కాదన్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత బిడ్డగా ఎన్నో ఏళ్ల తర్వాత వచ్చి మన కష్టాలను తీర్చడానికి కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎడారిగా మారుతున్న పేట జిల్లాకు శాశ్వత సాగునీరు అందించేందుకు రూ.మూడు వేల కోట్ల నిధులు కేటాయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు సాగునీరందించే అపర భగీరథుడైన రేవంత్‌రెడ్డికి అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అమలు చేసే ఉచిత విద్యుత్, సబ్సిడీ సిలిండర్‌లను ఇవ్వకుండా బీజేపీ, బీఆర్ఎస్‌లు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు సదాశివారెడ్డి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, మహ్మద్‌గౌస్, రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం కృషి చేసేది కాంగ్రెస్సే

చిన్నచింతకుంట/దేవరకద్ర : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వమని, ప్రజల కోసం నిరంతరం పని చేసేది కేవలం కాంగ్రెస్సేనని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కౌకుంట్ల మండలంలోని ముచ్చింతల, దేవరకద్ర మండలంలోని పుట్టపల్లి, వెంకటగిరి, రేకులంపల్లి, ఇస్రంపల్లి గ్రామాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ సభలకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చల్లా వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా మనం గెలిపించుకోవాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. ప్రతీ కార్యకర్త వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం గ్రామాల్లో కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలోనూ పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కిషన్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన మూణ్ణాళ్ల ముచ్చట

- మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి..
- బీజేపీ అభ్యర్థి డీకే అరుణ



జానంపేటలో అరుణ సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

భూత్పూర్/అడ్డాకుల, ఏప్రిల్ 30: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మూణ్ణాళ్ల ముచ్చటేనని, ఆరు గ్యారెంటీ పథకాల అమలులో పూర్తిగా విఫలం అయ్యిందని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆమె భూత్పూర్ మండలం కొత్త మొల్గర గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోసపూరిత మాటలు చెప్పి, ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా కొడంగల్‌కు, ఎంపీగా మల్కాజ్‌గిరికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఇప్పుడు ఏదో అద్భుతం చేస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా తుడుచుకోపోయిందని, ఆ పార్టీకి అభ్యర్థులే కరువు అయ్యారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జి కొండ ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నర్సిములు, రవీందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిషాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

దేశాన్ని దుండగులపాలు చెయ్యడానికి కుట్ర

హిందువులను తక్కువ చేసి.. కులాలు, మతాల వారీగా దేశాన్ని విడగొట్టి దుండగుల చేతిలో పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని డీకే అరుణ అన్నారు. మంగళవారం మూసాపేట మండలం జానంపేట, వేముల, అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. మోదీ దేశంలో రామరాజ్యం కోసం కృషి చేస్తుంటే ప్రపంచ దేశాల నాయకులు ప్రశంసిస్తున్నారన్నారు. బీజేపీ మరో 30 ఏళ్లు అధికారంలో ఉండి రామరాజ్యాన్ని స్థాపిస్తుందన్నారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లోని బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మరో సారి మోసపోవద్దు

- మళ్లీ కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి; చిత్రంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి రూరల్, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి ఒక సారి మోసపోయారని, మరోసారి ఆ తప్పు చేయొద్దని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌ను ఆదరించాలని, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. మంగళవారం ఆయన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి కోస్గి మండలంలోని సర్జాఖాన్‌పేట, తోగాపూర్, నాచారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని అనుకుంటున్నారని చెప్పారు. ఎంపీగా తనను గెలిపిస్తే.. కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రజల తరఫున పోరాడతానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ, నాయకులు పోశప్ప, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వెట్టిచాకిరి

- అమలు కాని పని గంటలు.. కనీస వేతన చట్టాలు
- పరిశ్రమల్లో స్థానికులకు దక్కని ఉపాధి
- ఉమ్మడి జిల్లాలో సంఘటిత రంగ కార్మికులు లక్ష మంది..
- నేడు మేడే



నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు

పాలమూరు, ఏప్రిల్ 30: చట్టాలు సరిగా అమలు కాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని కార్మికులు అవస్థలు పడుతున్నారు. పని గంటలు, కనీస వేతనాలు అమలు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలమూరు అంటే వలస కార్మికులకు మారుపేరు. రాష్ట్రం, దేశం, ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు కట్టినా అందులో పాలమూరు కూలీలు ఉంటారని పేరుండేది. ఉపాధి కోసం జిల్లా ప్రజలు పొట్ట చేతపట్టుకొని వలస వెళ్లడం అనాదిగా వస్తోంది. నేటికీ మహబూబ్‌నగర్, నారాయణపేట నుంచి ముంబయి బస్సు రోజూ కార్మికులతో నిండుగా వెళ్లడం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే.. సంఘటిత రంగాలైన బీడీ, హమాలీ, విద్యుత్, గ్రామ పంచాయతీ, కేజీబీవీ, ఆర్‌డబ్ల్యూఎస్, రైస్‌మిల్, మునిసిపాలిటీల్లో పని చేసే కార్మికుల ఆవేదన మరోలా ఉంది. కొన్ని విభాగాల్లో అగ్రిమెంట్ ప్రకారం ఏడాదికోసారి వేతనాలు పెంచాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం కార్మిక శాఖ తరఫున గుర్తించిన కార్మికులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు లక్ష మంది ఉండగా.. నిర్మాణ రంగంతో పాటు షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో పని చేసే వారు అనధికారికంగా మూడు లక్షలమంది వరకు ఉంటారని తెలుస్తోంది.

అమలు కాని వలస నివారణ చట్టం

వలస వెళ్లిన చోట ప్రమాదాలు, వేధింపులు, ఇతర సమస్యలకు గురవుతున్న కార్మికులకు వలస నివారణ చట్టం అమలు కాకపోవటంతో కష్టాలు తప్పటం లేదు. ఒక గ్రామం నుంచి కార్మికులను వలస తీసుకుపోతుంటే వారిని ఎక్కడికి తీసుకెళ్లి పని చేయించాలని అనుకుంటున్నారో గ్రామ పంచాయతీలో నమోదు చేయాలి. అలా నమోదు చేస్తే ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం ఉంటుంది. కానీ అలా చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికుల సంఖ్య అధికంగా ఉంది. వారికి రెండేళ్లకోసారి వేతన చట్టాన్ని సవరించాల్సి ఉంది. కానీ యజమానులు అమలు చేయడం లేదు. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నవారు మరో పని చేసుకోలేకపోతున్నారు. వీరు నెలలో 24 రోజులు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వలస కార్మికులతో వెట్టి చాకిరి

తక్కువ వేతనంతో వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడం అన్యాయం. కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలి.

- సి.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు

చట్టాలు అమలు కావడం లేదు

సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చడం కార్మికులకు ద్రోహం చేయడమే. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లను తేవడం క్షమించరానిది.

- రాములు యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

స్థానికులకు ఉపాధి కరువైంది

మహబూబ్‌నగర్‌లోని హోటల్స్ పిస్తాహౌస్, ఆస్పత్రులు, పరిశ్రమలు, రైస్ మిల్స్, సీయంఆర్, చెన్నై షాపింగ్‌మాల్స్‌లో స్థానికులను పెట్టుకోవటంలేదు. వలస కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగితే రాత్రికి రాత్రే ఎంతో కొంత ఇచ్చి పంపొచ్చని అలా చేస్తున్నారు.

- నల్లవెల్లి కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

మిడ్జిల్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నీలకంఠం కన్పించడం లేదని భార్య సుజాత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 25వ తేదీన సెంట్రింగ్ పని ఉందని హైదరాబాద్‌కు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి నీలకంఠం బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య భర్తకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన ఆమె బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజాపూర్ మండలంలో బాలిక..

రాజాపూర్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) సోమవారం సాయంత్రం అదృశ్యమైంది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో సంతకు వచ్చిన బాలిక రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. బాలిక జాడ కానరాకపోవడంతో మంగళవారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంక్ సిబ్బంది విధులకు ఆటంకం

- వ్యక్తికి రిమాండ్

ధరూరు, ఏప్రిల్ 30 : బ్యాంకు సిబ్బంది విధులకు ఆటంకం కల్గిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం రేవులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డోలు సూరి అలియాస్ సురేంద్ర సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామంలోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లాడు. పాస్‌బుక్ తీసుకువెళ్లకుండా వెళ్లిన అతను డబ్బులు ఇవ్వాలని సిబ్బందిని కోరగా అందుకు వారు నిరాకరించారు. పాస్‌బుక్ తీసుకురండని క్యాషియర్ సూచించారు. దీంతో సురేంద్ర బ్యాంకు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తూ వాగ్వాదానికి దిగాడు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ పార్వతమ్మతో కూడా గొడవపడి విధులకు ఆటంకం కలిగించాడు. ఈ విషయమై అసిస్టెంట్ మేనేజర్ ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 30 : వనపర్తి జిల్లాలో నేటి నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీకి ఆర్కే స్పోర్ట్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ 22 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

'పది'లో
సత్తా చాటిన న్యూరిషి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 11 మంది విద్యార్థులు 10 బై 10 జీపీఏ సాధించారు. మరో 11 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు. తొమ్మిది మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 19 మంది 9.5 జీపీఏ సాధించగా 82 మంది విద్యార్థులు 9. జీపీఏ సాధించారు. మొత్తం 98.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

లిటిల్ స్కాలర్స్ విద్యార్థుల జయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న లిటిల్ స్కాలర్ పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ విద్యార్థులు జయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ, నలుగురు విద్యార్థులు 9.8 జీపీఏ, 26 మంది 9.7 జీపీఏ నుంచి 9. జీపీఏ సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. జలజం సత్యనారాయణ ఆలోచన, ఆశయాలతో ముందుకు సాగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు.

రెయిన్‌బో విద్యార్థుల జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థులు మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన మన్హబింత్ మహమ్మద్, సయ్యద్ మిస్బాఉద్దీన్, అనిమిత్ ప్రీతం, మెతుకు శైలజ, అందే రోహిత్, ముసలి సాయికాంత్‌రెడ్డి, కె.శ్రీనాథ్‌రెడ్డి, ఆర్.పల్లవి, ఫాతిమాఫీదర్, ఎం.నక్షత్ర, జి.సాయిశ్రీరెడ్డి, వి.నందిని, బి.వైష్ణవిలు 10 బై 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. 9.8 జీపీఏ తొమ్మిది మంది, 9.7 జీపీఏ ఐదుగురు, 9.5 జీపీఏ ఐదుగురు, 9.3 జీపీఏ ఆరుగురు విద్యార్థులు సాధించారు. 9.2 ఎనిమిది మంది, 9. జీపీఏ ఆరుగురు సాధించారు. 90శాతం మంది విద్యార్థులు 8. జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మండుతున్న ఎండలు

» గద్వాల జిల్లా ఇటిక్యాలలో 44.7 డిగ్రీలు


మహబూబ్‌నగర్‌లోని సుభాష్‌చౌరస్తాలో ఎర్రటి ఎండలో తాటిముంజలు అమ్ముకుంటున్న దృశ్యం



ఎప్పుడూ రద్దీగా కనబడే అప్పనపల్లి ఫ్లైఓవర్ నిర్మానుష్యం


నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డు


అప్పనపల్లి సమీపంలో చెట్టు నీడన గొర్రెలు కాస్తున్న కాపరి

వడదెబ్బకు వృద్ధుడి మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 30 : ఎండలు విపరీతంగా ఉండడంతో ఓ వృద్ధుడు వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్‌రావు(60) హైదరాబాద్‌లో నివాసం ఉంటాడు. కొన్నిరోజుల క్రితం స్వగ్రామమైన గంట్రావుపల్లి గ్రామానికి వచ్చి మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం చూసుకోవడానికి వెళ్లాడు. పొలం దగ్గరే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండడంతో వడదెబ్బకు గురై వాంతులు చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ప్రేమలత, ఒక కూతురు ఉంది.


పాలమూరులో ఎండ వేడిమికి తలపై రుమాలుతో వెళుతున్న వాహనదారులు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 30 : పాలమూరు అట్టుడుకుతోంది.. భానుడి ప్రతాపానికి జనం బేజారవుతున్నారు... బయటకు వెళ్లాలంటేనే వణకాల్సి వస్తోంది.. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, ఎర్రటి ఎండ సలసలకాలే రోడ్లపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తప్పక ఎండకు బయటకు వెళితే మాడు పగులుతోంది. రికార్డ్ స్థాయిలో జిల్లాలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 44.7 డిగ్రీలు, గద్వాలలో 44.5, కేటీదొడ్డిలో 44.3, ధరూర్‌లో 44.2, అలంపూర్‌లో 43.3, రాజోలిలో 43.2, మల్దకల్‌లో 43, వడ్డేపల్లిలో 42.9, అయిజలో 42.9, ఉండవెల్లిలో 42.2, మానవపాడు 41.2, గట్టులో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంటలో 44.3 డిగ్రీలు నమోదుకాగా, కోయిలకొండలో 44.1 డిగ్రీలు నమోదైంది. దేవరకద్రలో 43.8, బాలానగర్‌లో 43.6, అడ్డాకుల, జడ్చర్లలో 43.5, మిడ్జిల్‌లో 43.4, రాజాపూర్‌లో 43.2, మూసాపేటలో 43.1, మహబూబ్‌నగర్, మహ్మదాబాద్‌లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా జిల్లాలో అత్యల్పంగా భూత్పూర్‌లో 42 డిగ్రీలు నమోదైంది.

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లిలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెబ్బేరులో 43.5, ఆత్మకూర్‌లో 43.2, శ్రీరంగాపూర్‌లో 43.0, పెద్దమందడిలో 42.9, చిన్నంబావి, పాన్‌గల్‌లో, అమరచింతలో 42.7, వనపర్తిలో 42.4, మదనాపూర్‌లో 42.3, ఘనపూర్‌లో 42.1, గోపాల్‌పేటలో 41.9, రేవల్లిలో 41.1, వీపనగండ్లలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 43.2, బిజినేపల్లిలో 43.1, వంగూరులో 43.0, అచ్చంపేటలో 42.7, ఉప్పునుంతలలో 42.4, తెల్కపల్లిలో 42.2, తాడూరులో 41.9, పెద్దకొత్తపల్లిలో 41.7, పదరలో 41.5, తిమ్మాజిపేటలో 40.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట జిల్లా నర్వలో 43 డిగ్రీలు, కోస్గి, మక్తల్‌లో 42 డిగ్రీలు, కృష్ణలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాల్పులు వీచడంతో ఇబ్బందులు పడ్డారు.

కల్లు తాగించి.. ఆపై హత్య

» మహిళను హత్య చేసిన నిందితుడి అరెస్టు
» వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్ గౌతమ్


మహిళ హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 : కల్లు తాగించి మహిళను శారీరకంగా అనుభవించాడు. ఆపై తనతో శారీరకంగా గడపాలని కోరగా నిరాకరించడంతో హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా హత్యకు సంబంధించిన వివరాలు మంగళవారం ఎస్పీ వెల్లడించారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఈనెల 25న అర్ధరాత్రి ఎనికెల లక్ష్మప్ప, సవిత(40) అనే మహిళను హత్య చేసి ఇంట్లో ఉంచాడు. రెండు రోజుల తరువాత వచ్చి డయల్ 100కు ఫోన్ చేసి తన ఇంట్లో ఓ మహిళను హత్య చేసి వేశారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేటకు తరలించారు. మృతురాలి తల్లి కోలుకుండే సాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా లక్ష్మప్పకు కల్లు తాగే అలవాటు ఉందని, మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో నర్సింహులుగౌడ్ కల్లు దుకాణంలో కల్లు తాగుతుండగా ఈనెల 25న ఉదయం 11 గంటల ప్రాంతంలో సవిత అనే మహిళ చిన్న పాపతో కల్లు దుకాణానికి వచ్చింది. లక్ష్మప్ప దగ్గరికి వెళ్లి నా దగ్గర డబ్బులు లేవు.. కల్లు పోయించు అని అడిగింది. దీంతో లక్ష్మప్ప సవితకు కల్లు పోయించాడు. అనంతరం ఒకరి ఫోన్ నెంబర్ ఒకరు తీసుకున్నారు. తరువాత ఇద్దరు కలిసి లక్ష్మప్ప ఇంటికి వెళ్లారు. లక్ష్మప్ప తన కోరికను తీర్చుకోవాలనే ఆలోచనతో ఈ పాపను వదిలి వస్తే మళ్లీ కల్లు తాపిస్తానని చెప్పడంతో సవిత తన కూతురిని పక్కింట్లో వదిలి లక్ష్మప్ప ఇంటికి వచ్చింది. ఆమెకు కల్లు తాపి తనతో గడపమని అడగగా ఆమె ఒప్పుకోకపోవడంతో బలవంతంగా అనుభవించాడు. కొద్దిసేపటికి మరలా అనుభవించడానికి చూడగా ఆమె ఒప్పుకోకపోవడంతో కోపంతో గొడ్డలి కర్రతో కొట్టాడు. ఆమె చనిపోయిందని నిర్ధారణ చేసుకున్న తరువాత ఆమె సెల్‌ఫోన్ పొలంలోకి విసిరేశాడు. ఆ తరువాత లక్ష్మప్ప తన అక్క కొడుకు నిశ్చితార్థం కోసం కర్ణాటకలోని క్యాసారం గ్రామానికి 26వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున శవాన్ని తన ఇంట్లోనే ఉంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు సాయంత్రం దామరగిద్దలో జోగు బాలప్ప అనే వ్యక్తి చనిపోవడంతో అక్కడ రాత్రి ఉండి ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న శవం నుంచి వాసన రావడంతో డయల్ 100కు ఫోన్ చేసి, ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి మృతదేహాన్ని ఇంట్లో వేశారని చెప్పారు. పోలీసులు లక్ష్మప్పను విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకొని, సవితను చంపడానికి ఉపయోగించిన గొడ్డలి కర్రతో పాటు సెల్‌ఫోన్‌ను చూపించాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని లక్ష్మప్పను అరెస్టు చేశారు. కేసు ఛేదించడంతో కృషి చేసిన డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్సై వసంత, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మిడ్జిల్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నేషనల్ దాబా దగ్గర ఏప్రిల్ 23వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ అనురాధ(35) మృతి చెందినట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, అతని భార్య అనురాధలు బైక్‌పై పని నిమిత్తం ఏప్రిల్ 23వ తేదీన జిల్లా కేంద్రానికి వెళ్లి అదేరోజు తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జడ్చర్ల పట్టణంలోని జాతీయ రహదారి నేషనల్ దాబా పరిసర ప్రాంతంలో రోడ్డుపై అడ్డుగా వస్తున్న వ్యక్తిని శ్రీనివాసులు బైక్ ఢీకొనడంతో అతనితో పాటు, భార్య అనురాధ కింద పడ్డారు. ప్రమాదంలో శ్రీనివాసులు కుడిచేతికి బలమైన గాయం కాగా, అనురాధకు చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించగా అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం డాక్టర్ల సలహా మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం అనురాధ మృతి చెందింది. శ్రీనివాసులు సోదరుడు కృష్ణకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని అంజనగిరి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రాజు తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తన కూతురిని తీసుకుని వనపర్తికి వస్తున్నాడు. అంజనగిరి గ్రామ శివారుకు రాగానే ఎదురుగా అంజనగిరి తండాకు చెందిన రాజునాయక్ వనపర్తి నుంచి ద్విచక్ర వాహనంపై తన తండ్రి సేవ్యానాయక్‌ను తీసుకుని వస్తు తండాకు వెళ్లే మలుపు వద్ద ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో రాజుకు, సేవ్యానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరూ వనపర్తిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వస్తువులు ధ్వంసం

గట్టు, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో వస్తువులు ధ్వంసమయ్యాయి. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే కేంద్రంలోకి చొరబడి వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రానికి వేసిన తాళం చెవిని విరగ్గొట్టి విధ్వంసానికి పాల్పడినట్లు అంగన్‌వాడీ టీచర్ వెంకట్రామమ్మ తెలిపారు. చిన్నారుల కోసం తీసుకొచ్చిన గుడ్లతో పాటు, బరువును చూసే యంత్రం, వారి కోసం ఉంచిన ఆట వస్తువులను ధ్వంసం చేసి పుస్తకాలను చిందరవందర చేశారు. గతంలో కూడా తాగునీటి కొళాయిని విరగ్గొట్టి కేంద్రంలోని మొక్కలను పీకేశారని గుర్తు చేశారు. ఈ విషయంపై ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కేంద్రాన్ని పరిశీలించి వెళ్లారని వెంకట్రామమ్మ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

మల్దకల్, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ ఎంపీడీవో కార్యాలయంలో మహిళా ఉద్యోగినిని వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్షావలి ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగికి అసభ్య పదజాలంతో వాట్సాప్ మెసేజ్‌లు చేస్తూ మానసికంగా వేధిస్తున్నాడు. ఉద్యోగిని మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్షావలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోట్లంపల్లి గ్రామంలో మద్యం పట్టివేత

ఆత్మకూరు, ఏప్రిల్ 30 : వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని మోట్లంపల్లి గ్రామంలో 24 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక టీం ఆధ్వర్యంలో గ్రామాలలో తనిఖీలు చేయగా మోట్లంపల్లి గ్రామంలోని ఎద్దుల రాములు అనే వ్యక్తి కిరాణాన్ని నడుపుతున్నాడు. కిరాణం దగ్గకు వెళ్లి తనిఖీలు నిర్వహించగా గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. నిర్వహించిన తనిఖీలలో 24 కింగ్‌ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ప్రత్యేక టీం సభ్యులు రాములు, పాషా, రమేష్‌లు పాల్గొన్నారు.

ఇంటికి నిప్పు

» భాగ పరిష్కారం చేయడం లేదని కుమారుడి ఘాతుకం
» తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు


అగ్నికి ఆహుతైన ఇంట్లోని వస్తువులు


బీరువాలో కాలిపోయిన దుస్తులు

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 : ఇంటిని భాగపరిష్కారం చేయడం లేదనే విసుగుతో తాగిన మైకంలో ఇంటికి నిప్పు పెట్టాడో కుమారుడు. ఈ ఘటనలో ఇల్లు దగ్ధమై రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదానికి కారణమైన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న కమురున్నీసాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన మహ్మద్ హబీబ్ ఇంటిని భాగపరిష్కారం చేయాలని కొంతకాలంగా తల్లిని, సోదరులిద్దరినీ ఒత్తిడికి గురి చేస్తున్నాడు. కొంతకాలం తర్వాత చేస్తానని తల్లి వాయిదా వేస్తూ వచ్చింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన మహ్మద్ హబీబ్ ఇంట్లో అందరూ నిద్రిస్తుండగానే పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టాడు. మంటలు వ్యాపించడంతో ఇంట్లో నిద్రిస్తున్న తల్లితో పాటు, అన్న మహమ్మద్ ఇలియాస్ కుటుంబం, తమ్ముడు మహ్మద్ ఫయాజ్ కుటుంబం ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. దీంతో ఇంట్లో ఉన్న నగదు, వస్తు సామగ్రి, పాస్‌పోర్టులు అన్నీ దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ఇలియాస్, ఫయాజ్‌లు తెలిపారు. ఘటనకు కారణమైన హబీబ్‌పై చర్యలు తీసుకోవాలని తల్లి, ఇద్దరు కుమారులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య


సాయిసంధ్య (ఫైల్)

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 30 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌బజార్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయిసంధ్య(26) నాలుగేళ్ల క్రితం పట్టణానికి చెందిన ఉమాశంకర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన కాలనీవాసులు విషయాన్ని భర్త ఉమాశంకర్‌కు తెలుపగా ఆయన భార్యను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలికి మూడు సంవత్సరాల పాప ఉంది. ఘటనపై ఎస్సై రామును సంప్రదించగా మృతికి గల కారణాల తెలియాల్సి ఉందని చెప్పారు.

బావిలో పడి మహిళ మృతి


దేవమ్మ (ఫైల్)

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని కడుకుంట్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి దేవమ్మ(55) గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా ఒక కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మరో కుమారుడు అదే గ్రామంలో ఉంటున్నాడు. రోజు మాదిరిగా సోమవారం కూలీ పనులకు వెళ్లిన దేవమ్మ సాయంత్రం ఇంటికి వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున తన వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దేవమ్మ మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


హేమంత్ (ఫైల్)

అమీర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటకు సంబంధించి వివరాలను ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన హేమంత్(28) వ్యాపారి. అదే గ్రామానికి చెందిన ఓ యువతి, హేమంత్ కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు కలిసి హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరై అనంతరం ఎస్ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న మద్యం తాగి హేమంత్ రాత్రి 2 గంటల ప్రాంతంలో బాత్‌రూంకు వెళ్లి ఎంతకి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి సదరు యువతి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే తన సోదరుడు వంశీకృష్ణ, స్నేహితులకు ఫోన్ చేసి చెప్పింది. హేమంత్‌ని మంచంపై పడుకోబెట్టి 108కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరీక్షించి హేమంత్ మృతి చెందినట్టు చెప్పారు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

రాజాపూర్, ఏప్రిల్ 30 : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండలం జాలుగడ్డతండా గ్రామ పంచాయతీ పలుగులగడ్డ తండాకు చెందిన శివమ్మ(36) కుటుంబంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు గడువుకు రేపే ఆఖరి తేదీ

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు మే రెండవ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

బావోజీ హుండీ ఆదాయం రూ.47 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది


కొత్తపల్లి, ఏప్రిల్ 30 : మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గిరిజనుల ఆరాధ్య దైవం బావోజీ ఆలయ హుండీ ఆదాయం రూ.47,53,578 వచ్చినట్లు ఆలయ ఈవో కోమల్ మంగళ వారం తెలిపారు. ఈ సందర్భంగా సోమ, మంగళవారం రెండు రోజుల పాటు జాతరకు వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. హుండీ ఆదాయం రూ.20,30,851 సమకూరగా, హనుమాన్ హుండీ ఆదాయం రూ.1,50,813 వచ్చింది. అదే విధంగా కాళికాదేవి హుండీ ఆదాయం రూ.14,24,414, పోతుల వేలం రూ.70,000, తైబజార్ రూ.18,500, లడ్డూ ప్రసాదం రూ.20,000, కొబ్బరి చిప్పలు రూ.15,000, కొబ్బరి కాయలు రూ.3,00,000, తలనీలాలు రూ.7,15,000 లతో కలిపి మొత్తం ఆలయానికి రూ.47,53,578 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దీంతో పాటు 1290 గ్రాముల వెండి ఆభరణాలు వచ్చాయి.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

▸▸ కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 : జిల్లాలో వచ్చే మూడు రోజులు వడగాలులతో పాటు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు చేరుకునే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు అవసరమైతే తప్ప ఎండలో బయటకు వెళ్లరాదన్నారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే తలకు టోపీలు, రుమాలు పెట్టుకోవాలని, గొడుగులు సైతం వినియోగించాలన్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా రోజుకు కనీసం ప్రతీ ఒక్కరు ఐదు లీటర్ల నీటిని తాగాలన్నారు. ప్రయాణాలు చేసే వారు తెల్లవారుజామున బయలు దేరేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎవరైనా వడ దెబ్బకు గురైతే వారి శరీరాన్ని చల్లటి తడి గుడ్డతో శరీర ఉష్ణోగ్రత 100 డిగ్రీల కంటే తక్కువ స్థాయికి వచ్చే వరకూ తూడుస్తూ ఉండాలన్నారు. వీరికి చికిత్స అందించేందుకు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు నీడతో పాటు తాగు నీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గడ్డం వినోద్, మోచీ సత్యనారాయణతో పాటు మరికొందరు మంగళవారం సీవీఆర్ బంగ్లాలో కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరినారాయణభట్టడ్, వేణుగోపాల్, ఎండీ సలీం, హన్నొద్దీన్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

నర్వ, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, నర్వ ఎస్ఐ కుర్మయ్య మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన రాంపూర్, లంకాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పోలీస్ బలగాలు ఉంటాయని, ఎవరైన అనవసర గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీతోనే దేశ ప్రగతి



పేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాగూరావు నామాజీ

నారాయణపేట, ఏప్రిల్ 30 : బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమని, ప్రధాని మోదీని హ్యాట్రిక్ ప్రధానిగా గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. మంగళవారం పేట 4, 15, 19 వార్డుల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో భాగంగా ఉచిత గ్యాస్ కనెక్షన్, మరుగుదొడ్లు, బియ్యం అందించి అన్నీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యరఘుపాల్, మిర్చి వెంకటయ్య, శ్రీనివాస్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

● మక్తల్ : మక్తల్ పట్టణంలోని 4వ వార్డులో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి గెలిపించాలన్నారు. దేశంలో మోదీ హవా నడుస్తుందని ముచ్చటగా మూడవసారి మోదీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి, కర్ని స్వామి, వన్నవాడ శ్రీకాంత్, పద్మరాములు, నాగప్ప, మల్లికార్జున్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఊట్కూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని రుద్రనగర్, శ్రీరాంనగర్ వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, కృష్ణయ్యగౌడ్, ఆశప్ప, రఘువీర్, తారాకృష్ణ, శాంతగౌడ్, కొండన్‌గోపాల్, వెంకటప్ప, జగన్, మహేష్, రమేష్, రవి పాల్గొన్నారు.

93.13 శాతం ఉత్తీర్ణత

▸▸ పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 15వ స్థానం

▸▸ ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నారాయణపేట జిల్లా ప్రథమం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో నారాయణపేట జిల్లా 15వ స్థానంలో నిలవగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. కలెక్టర్ కోయ శ్రీహర్ష, విద్యాశాఖపై ప్రత్యేక దృష్టిసారించి ఉపాధ్యాయుల సమష్టి కృషితో మంచి ఫలితాలను సాధించి జిల్లాకు పేరు తీసుకురావడంతో విద్యాభిమానుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నారాయణపేట జిల్లాలో బాలురు 3,598కి గాను 3,274 మంది ఉత్తీర్ణులు కాగా, బాలికలు 4,057కి గాను 3,855 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 7,655 మందికి గాను 7,189 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికలదే పైచేయి గా నిలిచింది. బాలురు 90.99 శాతం ఉత్తీర్ణత సాధిం చగా, బాలికలు 95.02 శాతం ఉత్తీర్ణత సాధించగా 93.13 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో పేట జిల్లా నిలిచింది. నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైష్ణవి 10/10, మరికల్ జడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో రాకేశ్ 10/10 గ్రేడింగ్ సాధించారు. మంచి ఫలితాలు సాధించడంతో డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ ఘనీకి సిబ్బంది స్వీట్లు తిని పించి అభినందించారు. కార్యక్రమంలో ఈసీజీ రమేశ్ శెట్టి, నాగార్జున రెడ్డి, శ్రీనివాస్, భానుప్రకాశ్, ఉదయ భాను, గంగాధర్, శశికళ, వెంకట్రాములు, వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఈవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రఘువీర్, విద్యా సాగర్, శ్రీనివాస్, భానుప్రకాశ్, బాలకిష్టప్ప, భాస్కర్, శశికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో శ్రీసాయి స్కూల్ విద్యార్థినులు అక్షర, దివ్య 10/10 గ్రేడింగ్ సాధించడంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో జిల్లా నిలవడంతో డీఈవో అబ్దుల్ ఘనీ, ఉపాధ్యాయులను కూడా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు శేషమ్మ, మురళీధర్, కవిత, బాలప్ప, గోపాల్‌రెడ్డి, సురేంద్రనాథ్, నర్సింహ పాల్గొన్నారు.

● మక్తల్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. పట్టణంలోని జ్యోతీ బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఓం కుమార్ 10 జీపీఏ సాధించగా, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సుస్మిత 9.5 జీపీఏ సాధించారు. జక్లేర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి తిరుపతి 9.3 సాధించారు. అలాగే పట్టణంలోని రేడియంట్, కృష్ణవేణి, అక్షర పాఠశాల విద్యార్థులు రాజ్‌కుమార్, రోజ, అమూల్య, ప్రవీణ్ కుమార్ 10 జీపీఏ సాధించారు.

● ధన్వాడ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 77 మంది ఉత్తీర్ణత సాధించారు. బబ్లునాయక్, కొర్ర తరణ్, కట్రావత్ శ్రీనివాస్ 10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు, నాగమణి విద్యార్థులను అభినందించారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నందిని 9.8, కల్యాణి 9.8, హర్షిత 9.7, సుజాత 9.5, అంబిక 9.2 జీపీఏ సాధించగా, పాఠశాలలో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● ఊట్కూర్ : పది ఫలితాల్లో మండల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో గత సంవత్సరం 82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఈసారి 98.473 శాతం ఉత్తీర్ణతను సాధించారు. పులిమామిడి కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు కుర్మమ్మ, అరుణ అపూర్వ 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ఊట్కూర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు కీర్తి, దివ్యలక్ష్మీ 9.7 జీపీఏ సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే ఉర్దూ మీడియంలో ఊట్కూర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సనా పర్వీన్ 8.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలువగా, ఊట్కూర్ మిల్లతే ఇస్లామియా పాఠశాల విద్యార్థిని సనాబాబు ఖురేషీ 8.7 జీపీఏ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంగ్లిష్ మీడియంలో పులిమామిడి ఉన్నత పాఠశాల విద్యార్థినులు హారిక, నందిని 9.3 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలో మొత్తం 524 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 516 మంది ఉత్తీర్ణత సాధించారు. మంచి ఫలితాలు సాధించడంతో ఎంఈవో వెంకటయ్య, పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, అనిల్ కుమార్, సత్యపాల్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, కృష్ణ, నర్సింగప్ప అభినందించారు.

● మాగనూరు : పది ఫలితాల్లో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మీనారాయణ 9.0 గ్రేడ్ మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు. మాగనూరులో 123 మంది విద్యార్థులకు గాను 115 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 93.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. వడ్వాటు ఉన్నత పాఠశాలలో 61 మందికి గాను 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత కాగా, 98.3 శాతం, నేరడుగం పాఠశాల నుంచి 29 మందికి గాను 20 మంది ఉత్తీర్ణత కాగా 68శాతం ఉత్తీర్ణత అయ్యారు. మాగనూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 38 మందికి గాను 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, 97.3 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● మరికల్ : పది ఫలితాల్లో మరికల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రాకేష్ 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. మొత్తం 149 మంది గాను 139 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల పాఠశాలలో 54 మందికి గాను 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సంగీత, కావ్య 9.3 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారు. ఉర్దూ మీడియం పాఠశాలలో తొమ్మిది మందికి గాను ఎనిమిది మంది ఉత్తీర్ణత సాధించగా, ఖరీమా బేగం 8.2 సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. గురుకుల పాఠశాలలో 92 మందికి గాను వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గౌతమ్, కవిత, ఐశ్వర్య 9.8 జీపీఏ సాధించారు. కన్మనూర్ పాఠశాలలో 57 మంది విద్యార్థులకు గాను 56 మంది ఉత్తీర్ణత సాధించారు. అపర్ణ 9.7 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. పెద్దచింతకుంట పాఠశాలలో 17 మందికి గాను 15మంది ఉత్తీర్ణత సాధించగా, రాజేష్ 8.7 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫేజ్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థి స్పందన స్కూల్ టాపర్‌గా నిలవగా ఉపాధ్యాయ బృందం అభినందించారు.

● కృష్ణ : పది ఫలితాల్లో మండలంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో వంద వాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో శాలిని తెలిపారు. మొత్తం 56 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాల గుడెబల్లూరు విద్యార్థిని రేణుక 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ప్రైవేటు మేరి మెమోరియల్ పాఠశాల విద్యార్థిని 9.7 జీపీఏ సాధించి రెండో స్థానంలో నిలిచింది. జడ్పీహెచ్ఎస్ కృష్ణ 95 శాతం, గుడెబల్లూరు 89 శాతం, కున్సి 88.57 శాతం, ముడుమాల్ 73.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 299 మంది విద్యార్థులకు గాను 273 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 91 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు.



డీఈవో అబ్దుల్ ఘనీని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



కలెక్టర్ కోయ శ్రీహర్షతో వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల పరిశీలకులు

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచోభూటియా, ఎన్నికల వ్యయ పరిశీలకుడు వరుణ్ రంగస్వామి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ కంట్రోల్ రూమ్ సువిధ సీ విజిల్, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని, సోషల్ మీడియా తదితర విభాగాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ గరీమా నరులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్ న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం సోషల్ మీడియా విభాగాన్ని సందర్శించి సోషల్ మీడియా పోస్టింగ్‌ను పరిశీలించారు. సువిధ ద్వారా ఇచ్చే అనుమతులు సీ విజిల్ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం, గ్రీవెన్స్‌లో నమోదైన ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి సమీపంలోని దత్త బృందావన్ బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేసిన రెండు స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్, స్ట్రాంగ్ రూముల భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో మధుమోహన్, నారాయణపేట, మక్తల్, తహసీల్దార్లు రాణా ప్రతాప్, సువర్ణ రాజు, డీపీఆర్వో రషీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

▸▸ మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్

నారాయణపేట, ఏప్రిల్ 30 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు కాంగ్రెస్‌తోనే పరిష్కారమౌతాయని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం పేట సీవీఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి బ్రహ్మాండమైన పాలన అందిస్తూ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు ఇస్తున్నారన్నారు. పీఆర్సీ 40 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించడానికి కృషి చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలో రెండింటిని చెల్లించాలని, నగదు రహిత కార్పొరేట్ వైద్యం అందించేలా సీఎం దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చించామన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విడుదల చేయించి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి విద్యాశాఖ బలోపేతంతో నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా చూస్తామన్నారు. 317 జీవో ద్వారా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మంత్రులతో కమిటీ వేసిందని తప్పకుండా న్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్‌గౌడ్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు సంతోష్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం పాల్గొన్నారు.

జిల్లాలో 13 వేసవి శిక్షణ శిబిరాలు





పేటలో ఆటలు ఆడుతున్న క్రీడాకారులు

నారాయణపేట, ఏప్రిల్ 30 : గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు జిల్లా యువజన సర్వీసులు, తెలంగాణ క్రీడా సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో వేసవిలో క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 13 శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళ వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 14 ఏళ్ల బాల బాలికలకు వివిధ క్రీడలపై వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా శిక్షణ ఇవ్వనున్నారు. క్రీడా శిబిరాల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచనున్నారు. క్రీడల నిర్వహణ కోసం క్రీడా పరికరాలు రాగా శిక్షణ ఇచ్చే కోచ్‌లకు రూ.4 వేల చొప్పున ఒక్కొక్కరికీ అందిస్తారు. గ్రామీణ ప్రాంత శిబిరాల క్రీడల నిర్వహణకు క్రీడా పరికరాలు రాగా, పట్టణ ప్రాంతాల శిక్షణ శిబిరాలను నారాయణపేట, మక్తల్, కోస్గిలో దాతల సహకారంతో నిర్వహిస్తారు.

'ఓటమి భయంతో తప్పుడు ప్రచారం'

మాగనూరు, ఏప్రిల్ 30 : బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను ఎదుర్కొనే ధైర్యం లేక ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీకే అరుణకు రోజు రోజుకూ పెరుగుతున్న జనాదరణ చూసి, కాంగ్రెస్ నాయకులు వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఈనెల 28న బీజేపీ పార్టీ మక్తల్ నియోజకవర్గం అనే ఒక లెటర్ ప్యాడ్ సృష్టించి చిరునామా, అడ్రస్ లేకుండా బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై అసహనం వ్యక్తం చేస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు లెటర్ రాస్తున్నట్లు తప్పుడు వార్తలు చూపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకు లు ఎన్ని ఎత్తుగడలు వేసినా బీజేపీ అభ్యర్థి గెలుపు తథ్యం అన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

మక్తల్, ఏప్రిల్ 30 : మక్తల్ పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం వద్ద బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అంబదాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 ఏళ్ల పైబడిన వారు తమ ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు జిరాక్సు ప్రతులతో ఉదయం 8 గంటలకు క్లబ్ భవనం వద్దకు రావాల న్నారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలు, ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

కోస్గి రూరల్, ఏప్రిల్ 30 : మహిళలను, అమ్మాయిలను ప్రేమ పేరుతో వేధిస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం ఏఎస్ఐ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం గుండుమల్ గ్రామంలో సమ్మర్ క్యాంప్ కోచింగ్ సెంటర్‌లో మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలను వేధించినా, అమ్మాయిల చుట్టూ ఆకతాయిలు తిరుగుతూ ప్రేమపేరుతో మోసం చేసినా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

టీడీపీకి రాజీనామా

నారాయణపేట, ఏప్రిల్ 30 : టీడీపీ సభ్యత్వంతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి మంగళవారం రాజీనామా చేసినట్లు వినయ్‌మిత్ర యాదవ్ తెలిపారు. పార్టీ విధి విధానాలు నచ్చకపోవడం, గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయకపోవడం, ఎంపీ ఎన్నికల్లో ఆంధ్రాలో బీజేపీ, జనసేనలతో పొత్తు పెట్టుకోవడం, తెలంగాణలో ఒక్క స్థానంలో కూడా పోటీ చేయక పోవడం లాంటి కారణాలతో పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

మే డే కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఊట్కూర్, ఏప్రిల్ 30 : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప, నాయకులు కృష్ణయ్య, చిన్నబాలు మేడే కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం జరగబోయే మే డే దినోత్సవంలో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల హక్కులు, ఎనిమిది గంటల పని కోసం 1871లో చికాగో నగరంలో కార్మికుల రక్త తర్పణంతో సాధించిన డిమాండ్లను, వారి త్యాగాల ఫలితంగా మే డేను ప్రతీ సంవత్సరం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని 138 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన మే డే ఉత్సవాలు నేటికీ కార్మికులు ప్రపంచ వ్యాపితంగా జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నిడుగుర్తి గ్రామ నాయకులు నరసింహ, అంజయ్య బాలప్ప పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మరికల్, ఏప్రిల్ 30 : మరికల్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి అక్రమంగా మద్యం తరలిస్తుండగా మంగళవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు మరికల్ శివారులో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. రూ.3,720 విలువ గల 15.06 లీటర్ల మద్యం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మురళి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మహేశ్వర్‌రెడ్డి అక్రమంగా లిక్కర్ తరలిస్తుండగా పటుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

'గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి'

మాగనూరు, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాగనూరు మండల ఇన్‌చార్జి జీవీ రవికుమార్ యాదవ్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వర్కూరు, నేరడుగం దొడ్డి, ఉజ్జల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచు ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, చక్రపాణి రెడ్డి, కృష్ణయ్య, నరసింహారెడ్డి గడ్డం నరేష్, వాకిటి వాటి, వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.